# కానుక



తలుపు తెరిస్తే భళ్ళున ఇల్లంతా వెలుతురు కమ్ముకున్నట్టు కపిలవస్తు నగరం నిండా  వెలుగు. జనం కళ్ళలో వెలుగు. గబ గబ పరుగులు. తోసుకోటాలు. సందడి. అందరి ముఖాల్లో చెరగని చిరునవ్వులు. గుండెలన్నీ ఉయ్యాల లూగుతున్నాయి. సంబరం తెర్లిపోతోంది.

“రాజకుమారుడు తిరిగొస్తున్నాడంట!”

“బుద్ధ డయ్యాడంట!”

"రాజ్యమేలవలసిన రాజు లోకాన్నంతా ఏలుతున్నాడంట!"

"రాజాధిరాజులు కాళ్ళబడి మొక్కులిడుతున్నారంట." గుస గుసలుగా చెప్పుకుంటూ గున గున పరుగులు. పెద్దల సంబరాలు చూస్తూ పిల్లల చప్పట్లు. రాజవీధిన కర్పూరోదకం కల్లాపి చల్లారు, ఆడవాళ్ళు రంగు రంగుల ముగ్గులు వలయాలు వలయాలుగా తీరుస్తున్నారు. కాళ్ళగజ్జెలు ఘల్లుఘల్లుమనగా జారిపోతున్న కరకంకణాలు పైకి తీసుకుంటూ ముక్కరలు పులుకు పులుకున మెరుస్తుండగా, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ, ముచ్చట్లు చెప్పుకుంటూ ముగ్గులేస్తున్నారు.

"అంతోసి అందగాడు అడవుల పాలాయెనే!"

"ఓరోజు రాజు వొంటిన ఎండసోకితే వారంపాటు వొళ్ళు కందిందట!"

"పవ్వళిస్తే పట్టుపరుపు దారం గుచ్చుకుందట! పాలమీది మీగడ పొరలో పంచదార పలుకు పంటికి కంటకమైందట!"

"అంత సుకుమారుడు అడవుల ఏ ఎండకాసెనో, ఏవాన తడిసెనో, ఏ ముళ్ళబాట నడిచెనో, ఏ కసరుకాయ కొరికెనో ..." అని వూసులాడుకుంటుంటే కళ్ళనీళ్ళు రాగా ముక్కులు ఎఱ్ఱబడగా, పదే పదే తుడుచుకుంటుంటే, ముక్కరలోని పుష్యరాగాలు ఎండకు ఎఱ్ఱగా మెరిసి, ముక్కులను మరింత ఎఱ్ఱగా చేస్తున్నాయి.

బాటనిండా పువ్వులు పరిచారు. మెత్తగా వొత్తిచూశారు స్వామిపాదాలు ఎక్కడ కసుగందుతాయోనని. మరింత వొత్తుగా పువ్వులు పోశారు.

అంతఃపురంలో యశోధర!

అలనాటి అర్ధరాత్రి నన్ను విడిచి వెళ్ళిన స్వామీ! ఈనాటి సుప్రభాతాన విచ్చేస్తున్నావా? మాట చెప్పకుండా మాయమయ్యావే! నేనడ్డు వస్తాననుకున్నావా ప్రభూ! మనసులోని కోరిక సూచనగా అన్నా, అన్ని సౌకర్యాలు చేసిపెడుదునే!

నేనడ్డమైతే నన్నే తొలగించుకుందునే! ఈ రోజు స్వామికి ఎలాగున స్వాగతమివ్వను? అద్దం ముందు అలంకరించుకోబోయింది యశోధర. తల దువ్వుకోబోయింది. తన ముంగురులు సరిదిద్దేస్వామి వెళ్లిపోయింతర్వాత తిరిగి జడ దువ్వుకోలేదు. తల జడలు కట్టింది. అలాగే ఉండనీ అనుకుంది. చెక్కిలి దిద్దుకోబోయింది. ఆ చెక్కిలికి పెదవులతికించి తన్ని తన గుండెలో పొదువుకున్న స్వామి తన కళ్ళలో కళ్ళు పెట్టి "నీ కళ్ళలోనే ఉదయ సాయంసంధ్య లున్నాయంటూ పవళ్ళూ రాత్రిళ్ళూ తన వొళ్ళో పడుకున్న స్వామి! తన విశాలమైనబాహువులతో ఈ శరీరాన్నందుకుని ఏక శరీరంగా చేసి మసలిన స్వామి! ఇన్నిరోజులకి తిరిగి వస్తున్నాడు! ఎలా అలంకరించను ఈ శరీరాన్ని, ఈ ముంగురుల్ని, ఈ చెక్కిళ్ళని, ఈ పెదవుల్ని. ఈ శరీరాన్నికాదని, వొద్దని వెళ్ళిపోయావుగా స్వామీ? మరి వీటిని అలంకరించను, అలాగేఉండనీ.

యశోధర అలంకరించుకోలేదు. అలనాటి అర్ధరాత్రి తన స్వామి తన్ని విడిచి వెళ్ళిపోయిన రాత్రి కట్టుకున్న పీతాంబరాన్నే తిరిగి కట్టుకుంది.

శుద్ధోదనుడు కళవళ పడుతున్నాడు. నా బిడ్డ తిరిగి వస్తున్నాడు! రాజాధి రాజులచేత పాదాలు కడిగించుకుని నాకొడుకు తిరిగొస్తున్నాడు అనుకుంటూ వెండి గడ్డం మెరుస్తుండగా అస్తిమితంగా పచార్లు చేస్తున్నాడు.అంతలో మనవడు రాహులుడు తాత దగ్గరికొచ్చాడు. రాహులుణ్ణి గుచ్చి ఎత్తుకుని "మీ నాన్న వస్తున్నాడయ్యా! మన మంతా స్వాగతం చెప్పాలయ్యా! పదయ్యా .... పద" అంటూ పొంగుతున్న కన్నీళ్ళు ఆపుకుంటూ ముందుకు నడిచాడు.

మంగళ వాద్యాలు మోగాయి. వీధుల్లో జనం కిక్కిరిసి ఉన్నారు. అల్లడుగో బుద్ధుడు! అల్లదే వెలుగు! వీధులనిండా వెన్నెల! అందరి కళ్ళల్లో వెన్నెల! ఆగని కన్నీటి ధారలు! గుబ గుబ లాడే గుండెలు! జలజలరాలుతున్న పూలు! వొళ్ళు పొంగి పోయేట్లు జయధ్వానాలు!

బుద్ధుడు అందరివైపు చూశాడు.

జనసముద్రం నిశ్శబ్దమై పోయింది. అందరికీ దిగ్భ్రమ! మైమరపు! రాజకుమారుడు సన్యాసి అయ్యాడు. రత్నకిరీటం లేదు. మణిహారాలు లేవు. కాషాయాంబరాలతో, చిరునవ్వు తూపులతో అందరి కళ్ళలోకి చూస్తున్నాడు. ఆకాశంలోంచి కాంతి గోళం భూమిని తాకినట్టుంది. అందరూ నిశ్చేష్టులై చూస్తున్నారు.

స్వామి ముందుకు నడుస్తున్నాడు. పువ్వులు నలిగిపోకుండా నడుస్తున్నాడు. పువ్వులు తమ జన్మ ధన్యమైనట్టు బుద్ధుడి పాదాల కంటుకుని వదలటం లేదు. జనం బుద్ధుని పాదాలమీద పడిపోతున్నారు. కన్నీళ్ళతో కాళ్ళు కడుగుతున్నారు. ఆ చూపు, ఆ నవ్వు, ఆ అభయం! అందరూ ద్రవించి పోతున్నారు.

యశోధర ముందుకు వచ్చింది. తన శిరోజాల్లాగే స్వామి శిరోజాలు కూడా జడలు కట్టాయి. బుద్ధుడు యశోధరని చూసి చిరునవ్వు నవ్వాడు. యశోధరకు మాట రాలేదు. గొంతు విచ్చు కోలేదు. బుద్ధుడి పాదాలు తాకింది యశోధర. ఆ స్పర్శ అతిలోకంగా తోచింది.

ముందుకు వస్తున్న బుద్ధుడికి తండ్రి శుద్ధోదనుడు ఎదురు వచ్చాడు. కన్నీళ్ళు కాలవలవుతూండగా శుద్ధోదనుడు అన్నాడు. "అయ్యా! నువ్వు నా కొడుకువి. నేను నీకు తండ్రిని. నువ్వు లోకానికి తండ్రివయ్యావు. లోకాలకు తండ్రివయిన నీకు నీ తండ్రి ఏమిచ్చుకోగలడు? నీకొడుకునే నీకు కానుకగా ఇచ్చుకుంటాను" అంటూ రాహులుణ్ణి బుద్ధుడికి అర్పించాడు. ఆ దృశ్యాన్ని పాలరాతిలో పలికించి మన కందించాడు అమరావతి శిల్పి.*